PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?
విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...
ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.
ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 216 | సంపుటి 4 | గురువారం | 23-04-2026 | పేజీలు 4 | వెల 3/- | ఎడిటర్ పి. రవిచంద్ర

- రాష్ట్రవ్యాప్తంగా నిలిచిన 9వేల సర్వీసులు
- డిపోల వద్ద ఉద్రిక్తత..పోలీసులు, కార్మికులకు మధ్య వాగ్వాదం
- పరీక్షలకు వెళ్లలేక విద్యార్థుల ఇబ్బందులు..
- సమ్మె సాకుతో ప్రైవేటు వాహనదారుల దోపిడీ
- ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు
- అద్దె బస్సులు, ఔట్ సోర్సింగ్ విధానంలో సిద్ధం చేసిన అధికారులు

## సమ్మెతో 'సకల జనం' బేజారు!



# స్తంభించిన రవాణా..

2

రాష్ట్రంలో రవాణా రంగం సంక్షోభంలో కూరుకు పోయింది. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు బుధవారం అర్ధరాత్రి నుంచి కార్మికులు సమ్మెకు దిగడంతో రాష్ట్ర వ్యాప్తంగా రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కార్మికులు విధులను బహిష్కరించారు. సీనియర్ ఐఏఎస్ అధి కారుల కమిటీతో జరిపిన చర్చలు విఫలం కావడంతో కార్మికులు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు.

—ప్రభాత గమనం, హైదరాబాద్

రాష్ట్రంలో రవాణా వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. ఆర్టీసీ కార్మికులు 'సమ్మె' సైరన్ ఊదడంతో తెలంగాణవ్యాప్తంగా పల్లె వెలుగు నుంచి పరంజ్యోతి వరకు అన్ని సర్వీసులు డిపోలకే పరిమితమయ్యాయి. ఎన్నికల హామీల అమలు కోసం జేఏసీ ఇచ్చిన పిలుపుతో బుధవారం అర్ధరాత్రి నుంచే చక్రాగిపోగా, తెల్లవారుజాము నుంచి ప్రయాణికులు రోడ్లపైకి వచ్చి హాహాకారాలు చేశారు. ఒకవైపు డిపోల వద్ద పోలీసులకు, కార్మికులకు మధ్య తోపులాటలతో ఉద్రిక్తత నెలకొనగా.. మరోవైపు ఇదే అదనుగా ప్రైవేటు వాహనదారులు చార్జీల దోపిడీకి తెరలేపారు. ఒకవైపు వార్షిక పరీక్షలకు వెళ్లాల్సిన విద్యార్థుల ఆవేదన.. మరోవైపు ఆసుపత్రులకు వెళ్లలేక రోగులు తల్లడిల్లిన స్థితి.. వెరసి ఆర్టీసీ సమ్మె రాష్ట్రవ్యాప్తంగా పెను సంక్షోభాన్ని సృష్టించింది. ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో కార్మికులు సమ్మె బాట పట్టగా, సుమారు 9వేల బస్సులు రోడ్డెక్కలేదు. ప్రయాణికుల ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం అద్దె బస్సులు, ప్రైవేటు డ్రైవర్లతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో రవాణా కష్టాలు తీరడం లేదు. ప్రభుత్వ విలీనం, ఎన్నికల హామీల చుట్టూ తిరుగుతున్న ఆర్టీసీ సమ్మె ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. కార్మిక సంఘాలు పట్టువీడకపోవడంతో రవాణా శాఖ అధికారులు 'ప్లాన్-బి'ని అమలు చేస్తూ 1000 అద్దె బస్సులను రంగంలోకి దించారు. నగరవాసులకు మెట్రో ఊరటనిస్తున్నా, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించింది. బీజేపీ, బీఆర్ ఎస్ వంటి విపక్షాలు సమ్మెకు మద్దతు తెలపడంతో, ఈ పోరాటం కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద సవాల్ గా మారింది.

## పట్టణాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పన్నులు చెల్లించాలి
- విద్యాశాఖలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

04



పట్టణాలు , గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని అధిక నిధులు కేటాయి స్తోందని, ప్రజలు తమ ఇంటి పన్ను, నల్లా పన్ను బాధ్యతా యుతంగా చెల్లించి అభివృద్ధికి సహకరించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు.



3

## సమస్యల నిలయంగా
# గార్ల బస్టాండ్

- అసంపూర్తిగా మిగిలిపోయిన మరుగుదొడ్ల నిర్మాణం
- బస్టాండ్ అంతా పేరుకుపోయిన చెత్త.. అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- మండు వేసవిలో కనీసం తాగునీటి సౌకర్యం కల్పించని వైనం
- తక్షణమే వసతులు కల్పించి బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలని స్థానికుల వేడుకోలు

దశాబ్దాల నిరీక్షణ ఫలించి బస్సులు అయితే వచ్చాయి కానీ.. ఆ బస్టాండ్ లో అడుగు పెట్టాలంటేనే ప్రయాణికులు వణికిపోతున్నారు. ఏళ్ల తరబడి ఎదురుచూసిన కల నెరవేరిందన్న సంతోషం కంటే, అక్కడ ఎదురవుతున్న 'నరకం' గార్ల ప్రజలను ఎక్కువగా బాధిస్తోంది. కనీస సౌకర్యాల కల్పనలో అధికారులు ఘోరంగా విఫలం కావడంతో, కొత్త బస్టాండ్ కాస్తా సమస్యల నిలయంగా మారి వెక్కిరిస్తోంది. అసంపూర్తిగా మిగిలిన మరుగుదొడ్లు.. గుక్కెడు మంచినీటికీ అల్లాడుతున్న ప్రయాణికులు.. ఎటు చూసినా పేరుకుపోయిన చెత్తాచెదారం! ఇది గార్ల బస్టాండ్ ప్రస్తుత దుస్థితి. భవన నిర్మాణంపై చూపిన శ్రద్ధను కనీస వసతులపై చూపకపోవడంతో, ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు వర్ణనాతీతమైన ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల తర్వాత వచ్చిన బస్సు సౌకర్యం, అధికారుల నిర్లక్ష్యం వల్ల శాపంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో
# 9 మంది ఎస్సైల బదిలీ

ఉత్తర్వులు జారీ చేసిన సీపీ సన్‌ప్రీత్ సింగ్



2



3

## మడిపల్లిలో 15 సీసీ కెమెరాల ఏర్పాటు

- మన ఊరు మన బాధ్యతలో భాగంగా ఏర్పాటు
- 200 మందితో బైక్ ర్యాలీ
- పాల్గొన్న మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్



## ట్రాఫిక్ సిబ్బందికి చలువ అద్దాల పంపిణీ

- ఎండ తీవ్రతలో ఆరోగ్య పరిరక్షణపై దృష్టి
- ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు

ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో

వేసవికాలంలో పెరుగుతున్న ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ సిబ్బంది ఆరోగ్య రక్షణకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శరత్ కంటి హాస్పిటల్ వారి సౌజన్యంతో హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు చేతుల మీదుగా ట్రాఫిక్ సిబ్బందికి చలువ అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ ప్రభాకర్ రావు మాట్లాడుతూ, ట్రాఫిక్ సిబ్బంది రోజంతా ఎండలో విధులు నిర్వర్తించాల్సి వస్తుందని, అందువల్ల వారి ఆరోగ్య పరిరక్షణ అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. కంటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ చలువ అద్దాలు వారికి ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణలో నిమగ్నమై ప్రజలకు సేవలందిస్తున్న సిబ్బంది సంక్షేమం కోసం ఇలాంటి కార్యక్రమాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. శరత్ కంటి హాస్పిటల్ ప్రతినిధులు కూడా సామాజిక బాధ్యతగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని ఆరోగ్య సంబంధిత కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీతా రెడ్డి, ట్రాఫిక్ సిబ్బంది మరియు శరత్ కంటి హాస్పిటల్ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం సానుకూల వాతావరణంలో ముగిసింది.



## రివిజనిజంపై పోరాటమే లక్ష్యం

- ఘనంగా సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆవిర్భావ వేడుకలు

గార్ల, ఏప్రిల్ 22 ( ప్రభాత గమనం):

భారత విప్లవ చరిత్రలో ఏప్రిల్ 22వ తేదీ ఒక చారిత్రాత్మక మలుపు అని, విప్లవ శక్తుల ఐక్యతకు ఇది నిదర్శనమని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జడ సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవం, లెనిన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్యనారాయణపురం, ముల్కనూరు, చిన్న కిష్టాపురం, గోపాలపురం, యాదనేకపురం మరియు గార్ల మండల కేంద్రాల్లో పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం మద్దివంచ గ్రామంలో జరిగిన మండల సదస్సులో నాయకులు ప్రసంగించారు.లెనిన్ ఆశయాలకు విరుద్ధంగా సాగుతున్న రివిజనిజం (సవరణవాదం) నడ్డి విరిచి, విప్లవ శక్తులను ఏకం చేసిన రోజని జడ సత్యనారాయణ అభివర్ణించారు.వ్యవసాయ విప్లవమే ఇరుసుగా, భూస్వామ్య, పెట్టుబడిదారీ మరియు సామ్రాజ్యవాద శక్తులను, వారికి కొమ్ముకాసే పాలకులను అంతిమ శత్రువులుగా గుర్తించి నూతన ప్రజాస్వామ్య విప్లవం వైపు సాగాలని పిలుపునిచ్చారు.ఈ దేశంలో భూమి, భుక్తి మరియు విముక్తి కోసం వేలాది మంది విప్లవకారులు ప్రాణత్యాగం చేశారని, వారి ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త నడుం బిగించాలని కోరారు.మండల కార్యదర్శి జి. సక్రు మాట్లాడుతూ.. పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడడమే పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు గౌని భద్రయ్య, గౌని మల్లేష్, సిహెచ్ గణేష్, ఎస్. మనోహర్, ఎం. మానియా, జడ ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.




## తీన్మార్ మల్లన్నను కలిసిన ఆర్టీసీ జేఏసీ నాయకులు

- సమ్మెకు మద్దతు తెలుపాలని వినతి
- సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించిన టీఆర్పీ అధినేత

హైదరాబాద్ ఏప్రిల్ 22, ప్రభాత గమనం :

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజీఎస్ ఆర్టీసీ) కార్మికుల సమ్మె నేపథ్యంలో ఆర్టీసీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు బుధవారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా జాక్ నాయకులు ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఆర్థిక సమస్యలు, ఉద్యోగ భద్రత వంటి అంశాలను వివరించి, కొనసాగుతున్న సమ్మెకు మద్దతు ఇవ్వాలని మల్లన్నని కోరారు. అలాగే కార్మికుల తరఫున పెట్టిన 32 డిమాండ్లను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తీన్మార్ మల్లన్న స్పందిస్తూ ఆర్టీసీ కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్మికుల హక్కులు, వేతన సవరణలు, ఉద్యోగ భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.



# స్తంభించిన రవాణా..

## సమ్మెతో 'సకల జనం' బేజారు!

మొదటి పేజీ తరువాయి..

తెల్లవారుజాము నుంచే హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్లతో పాటు జిల్లాల్లోని అన్ని డిపోలు బస్సులు లేక వెలవెలబోయాయి.

### కుప్పకూలిన రవాణా వ్యవస్థ

సమ్మె ప్రభావం సామాన్య ప్రయాణికులపై తీవ్రంగా పడింది. ముఖ్యంగా వేసవి సెలవుల రద్దీ, శుభకార్యాల సీజన్ కావడంతో వేలాది మంది ప్రయాణికులు బస్టాండ్లలో పడిగాపులు కాశారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులు సమయానికి బస్సులు లేక విలవిల్లాడారు. ఆసుపత్రులకు వెళ్లాల్సిన రోగులు, గర్భిణులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఇదే అదనుగా ప్రైవేటు ఆటోలు, ట్యాక్సీ డ్రైవర్లు ప్రయాణికుల నుండి మూడు రెట్లు అధిక ఛార్జీలు వసూలు చేస్తూ దోపిడీకి తెరలేపారు. కొన్ని చోట్ల ప్రజలే స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

### ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు..

సమ్మెను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించింది. సుమారు 1000 అద్దె బస్సులను ఔట్ సోర్సింగ్ డ్రైవర్లతో నడిపించేందుకు రవాణా శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. చాలా చోట్ల కండక్టర్లు లేకుండానే బస్సులను నడిపిస్తూ, ప్రైవేటు సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్‌లో మెట్రో సర్వీసులను పెంచి, ప్రతి 3–4 నిమిషాలకు ఒక రైలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. అయితే, అనుభవం లేని డ్రైవర్లతో బస్సులు నడపడంపై ప్రయాణికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



మెదక్ వంటి ప్రాంతాల్లో ప్రైవేటు సిబ్బందితో బస్సులు తీసే ప్రయత్నం చేసిన పోలీసులను కార్మికులు అడ్డుకోవడంతో స్వల్ప తోపులాట జరిగి ఉద్రిక్తత చోటుచేసుకుంది.

### డిపోల ఎదుట కార్మికుల ఆందోళన :

ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా 600 కుపైగా బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఖమ్మంలో సమ్మె సంపూర్ణంగా కొనసాగింది. కార్మికులు బస్సులను నిలిపి తెల్లవారుజాము నుంచే డిపోల ఎదుట ఆందోళన చేశారు. రీజియన్‌లోని 7 డిపోలకు చెందిన 608 బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 7 డిపోల్లో బస్సులు పాక్షికంగా నడిచాయి. జిల్లాలో 180కి పైగా ఉన్న ఎలక్ట్రిక్, ప్రైవేటు బస్సులు ప్రయాణికుల్ని గమ్యస్థానాలకు చేర్చాయి. సూర్యాపేట జిల్లా కోదాడ బస్ డిపో ఎదుట కార్మికులు సమ్మెకు దిగారు. సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ జూబ్లీ బస్ స్టేషన్‌లో, పికెట్, కంటోన్మెంట్, రాణిగంజ్ డిపోలలో బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఉత్తర తెలంగాణకు వెళ్లాల్సిన బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెదక్ డిపో ముందు బైఠాయించి సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులను పోలీసులు పక్కకు తరలించి పటాన్‌చెరుకు ఓ బస్సు పంపించడంతో కార్మికులకు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. సంగారెడ్డిలో ఆర్టీసీ బస్సులు లేక విద్యార్థులు సమయానికి పరీక్షలకు వెళ్లలేక పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రులకు సైతం వెళ్లలేక పోతున్నామని వాపోతున్నారు.

### పెంచిన మెట్రో సర్వీసులు

సమ్మె నేపథ్యంలో హైదరాబాద్ లో మెట్రో సర్వీసులను పెంచారు. సమ్మె కాలంలో 56 అదనపు మెట్రో రైళ్లు నడుపుతోంది. మియాపూర్–ఎల్బీనగర్ మార్గంలో 4 నిమిషాల 20 సెకన్లకో మెట్రో ట్రైన్, నాగోల్–రాయదుర్గం మార్గంలో 3 నిమిషాల 40 సెకన్లకో మెట్రో ట్రైన్ తిరుగుతున్నాయని సంస్థ ప్రకటించింది.



బస్సులు కదలకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ఆర్టీసీ కార్మికుల సమ్మె కారణంగా యాజమాన్యం ప్రైవేటు డ్రైవర్లను రంగంలోకి దించడంతో లారీని ఢీకొట్టిన కరీంనగర్ డిపో బస్సు



## పోలీస్ పహారాలో రోడ్డెక్కిన బస్సులు

- ఆర్టీసీ కార్మికులతో కలిసి అడ్డుకున్న సీపీఐ నేతలు
- ప్రభుత్వం వెంటనే ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు

మహబూబాబాద్, ప్రభాత గమనం :

తమ న్యాయమైన డిమాండ్ల కోసం రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు సీపీఐ మద్దతు తెలుపుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పోలీసుల పహారాలో బస్సులు నడపాలని యాజమాన్యం ప్రయత్నిస్తుంటే ఆర్టీసీ కార్మికులతో కలిసి బస్సులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. వెంటనే డిమాండ్లను ఒప్పుకొని కార్మికులకు న్యాయం చేయాలన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో సమ్మె చేస్తున్న కార్మికులను అణగదొక్కాలని చూస్తే బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఏ గతి పట్టిందో గమనించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అద్దెకు డ్రైవర్లను తీసుకువచ్చి బస్సులను నడపాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. కొన్ని ప్రాంతాలలో ప్రయివేట్ డ్రైవర్లను ఉపయోగించడం ద్వారా కరీంనగర్ తదితర ప్రాంతాల్లో యాక్సిడెంట్లు అయ్యాయన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను ఒప్పుకొని సమ్మె విరమించేలా చూడాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయసారథి,సహాయ కార్యదర్శి బి అజయ్ సారథి రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్, పెరుగు కుమార్, దేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, వరి పల్లి వెంకన్న,వెలుగు శ్రావణ్, చొప్పరి శేఖర్, ఆబోతు అశోక్, రాగం మల్లయ్య, జంపాల వెంకన్న, బాలాజీ, కూన సత్యం, బోళ్ల భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో 9 మంది ఎస్సైల బదిలీ


ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న తొమ్మిది మంది ఎస్ఐలకు స్థాన చలనం కల్పిస్తూ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా కారణాల దృష్ట్యా ఈ బదిలీలు వెంటనే అమల్లోకి రావాలని ఆదేశించారు. జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, సీసీఎస్ వరంగల్‌లో విధులు నిర్వహిస్తున్న సాయి ప్రసన్న కుమార్‌ను నల్లబెల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నియమించగా, అక్కడ విధులు నిర్వహిస్తున్న వి. గోవర్ధన్‌ను వీఆర్ వరంగల్‌కు బదిలీ చేశారు. మడికొండ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న జి. రామ్ మోహన్‌ను ఖానాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నియమించగా, అక్కడి ఎస్ఐ సిహెచ్. రఘుపతి వీఆర్ వరంగల్‌కు మారారు. అలాగే ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఈ. నర్సింహారావును ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నియమించగా, ఎల్కతుర్తి ఎస్ఐ ఎ. ప్రవీణ్ కుమార్‌ను వీఆర్ వరంగల్‌కు బదిలీ చేశారు. వీఆర్ వరంగల్‌లో ఉన్న ఏ. శ్రీకాంత్‌ను బచ్చన్నపేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా నియమించగా, అక్కడి ఎస్ఐ ఎస్.కే హమీద్‌ను వీఆర్‌కు పంపించారు. ఇక వీఆర్ వరంగల్‌లో ఉండి భరోసా సెంటర్‌కు అనుబంధంగా పనిచేస్తున్న బి. మంగాను కాజీపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.



# సమస్యల నిలయంగా గార్ల బస్టాండ్

- ప్రయాణికులకు తప్పని తిప్పలు..
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికుల డిమాండ్



గార్ల, ఏప్రిల్ 22, ప్రభాత గమనం:

దశాబ్దాల నిరీక్షణ ఫలించి బస్సులు వస్తున్నా.. ఆ బస్టాండ్‌లో అడుగుపెట్టాలంటేనే ప్రయాణికులు వణికిపోతున్నారు. ఏళ్ల తరబడి బస్సుల రాక కోసం ఎదురుచూసిన గార్ల ప్రజల కల నెరవేరినప్పటికీ, కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. ప్రస్తుతం ఈ బస్టాండ్ సమస్యల నిలయంగా మారి, ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తోంది.బస్టాండ్‌లో నిర్మించిన మరుగుదొడ్లు పూర్తికాక దర్శనమిస్తున్నాయి. అత్యవసర సమయంలో ప్రయాణికులు, ముఖ్యంగా మహిళలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. మరుగుదొడ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోవడంతో అవి నిరుపయోగంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి.స్టేషన్ ప్రాంగణం అంతా పేరుకుపోయిన చెత్తాచెదారంతో అధ్వాన్నంగా తయారైంది. పారిశుధ్య నిర్వహణను గాలికి వదిలేయడంతో ప్రయాణికులు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం పొంచి ఉంది. ఇక ఎండలు మండిపోతున్న తరుణంలో, ప్రయాణికులకు గుక్కెడు మంచినీరు అందించే నాథుడే కరువయ్యారు. చల్లని తాగునీటి సదుపాయం లేకపోవడంతో ప్రయాణికులు ప్రైవేట్ షాపులను ఆశ్రయించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు."బస్సులు వస్తున్నాయని సంతోషించాలో.. బస్టాండ్‌లో ఈ నరకం చూసి బాధపడాలో అర్థం కావడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి యుద్ధ ప్రాతిపదికన మరుగుదొడ్లు, తాగునీటి వసతి కల్పించాలి."కేవలం భవనాలు కట్టడమే కాదు, వాటి నిర్వహణను కూడా బాధ్యతగా తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



# విప్లవ పోరాటాలతోనే సమసమాజ స్థాపన

- సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి ఏ.కే. ఎమ్మెస్

డోర్నకల్, ఏప్రిల్ 22, ప్రభాత గమనం:

సమసమాజ స్థాపన కోసం విప్లవ పోరాట బాటలో పయనించడమే ఏకైక పరిష్కారమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి ఏ.కే. ఎమ్మెస్ పిలుపునిచ్చారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని వెన్నారం గ్రామంలో సీపీఐ(ఎంఎల్) 57వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.భాస్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏ.కే. ఎమ్మెస్ ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దశాబ్దాలుగా పేద, బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం న్యూడెమోక్రసీ రాజీలేని పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. దోపిడీ రహిత సమాజం కోసం ప్రతి కార్యకర్త విప్లవ స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేవలం రాజకీయ కార్యక్రమాలకే పరిమితం కాకుండా, సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఏ.కే. ఎమ్మెస్ ప్రారంభించారు. ప్రజా సమస్యల పోరాటంతో పాటు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని స్థానికులు కొనియాడారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఐలన్న, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి మండల వెంకన్న, సీనియర్ నాయకులు లింగన్న, భాస్కరరావు, వార్డు మెంబర్లు సత్యం, లాలు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాము, శంకర్ రావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# జనాభా గణన దేశ భవిష్యతుకు పునాది

- తహసీల్దార్ జి. వివేక్
- కేసముద్రం పాఠశాలలో ఎన్యుమరేటర్లకు శిక్షణ

కేసముద్రం, ఏప్రిల్ 22, ప్రభాత గమనం :

దేశాభివృద్ధికి, నూతన పథకాల రూపకల్పనకు జనాభా గణనే కీలకమని కేసముద్రం తహసీల్దార్ చార్జ్ ఆఫీసర్ జి. వివేక్ పేర్కొన్నారు. స్థానిక కేసముద్రం స్టేషన్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రెండవ బ్యాచ్ ఎన్యుమరేటర్ల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు..ప్రభుత్వ పరిపాలన విధానాలు, నూతన ఆవిష్కరణలు అన్నీ జనాభా లెక్కల ఆధారంగానే రూపొందుతాయని వివరించారు. ఎన్యుమరేటర్లు క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడు అత్యంత ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని, ఏ చిన్న పొరపాటు జరిగినా అది భవిష్యత్తు ప్రణాళికలపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు.అడిషనల్ చార్జ్ ఆఫీసర్,ఎంపీడీవో క్రాంతి మాట్లాడుతూ.. ఈసారి జనాభా గణన ప్రక్రియలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు.పూర్తిస్థాయిలో డిజిటల్ విధానంలో గణన జరుగుతుందని వెల్లడించారు.ప్రజలు తమంతట తామే వివరాలను నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' సౌకర్యాన్ని ఈసారి కల్పించామని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.తొలి దశలో భాగంగా ఇండ్ల గణన, ఇండ్ల జాబితాను ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సౌజన్య, ఫీల్డ్ ట్రైనర్లు యేదునూరి అశోక్, బోరిగం రాములు, ఏఎస్ఓ వేణుతో పాటు వివిధ విభాగాల సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు. శిక్షణ పొందుతున్న వారు తమ సందేహాలను అధికారుల ద్వారా నివృత్తి చేసుకున్నారు.






# పుల్లూరు ఎస్సీ కాలనీలో సిబ్బంది పారిశుధ్య పనులు

- స్వయంగా పర్యవేక్షించిన సర్పంచ్ బాబురావు
- ప్రభాత గమనం కథనానికి స్పందన

గార్ల, ఏప్రిల్ 22, ప్రభాత గమనం :

మండల పరిధిలోని పుల్లూరు గ్రామ ఎస్సీ కాలనీలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. గత కొద్ది రోజులుగా కాలనీలోని పలు వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, అపరిశుభ్ర వాతావరణంపై మంగళవారం ప్రభాత గమనం దినపత్రికలో వచ్చిన ప్రత్యేక కథనానికి స్పందించిన సర్పంచ్ బాబురావు, యుద్ధప్రతిపాదికన పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వయంగా రంగంలోకి దిగి, సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. కాలనీ వాసులకు ఇబ్బందికరంగా మారిన చెత్త కుప్పలను తొలగించడమే కాకుండా, మురుగు కాలువల్లో పేరుకుపోయిన పూడికను కూడా తొలగింపజేశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో వ్యాధులు ప్రబలకుండా ముందుస్తుగా ఈ పారిశుధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. కాలనీ దారుల్లో అడ్డంగా ఉన్న ముళ్లపొదలు, వ్యర్థాలను తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు. గ్రామ సర్పంచ్ బాబురావు స్వయంగా పనులను పర్యవేక్షించడం పట్ల కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మురుగు కూపంలో పుల్లూరు ఎస్సీ కాలనీ

- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- చర్యలు చేపట్టాలని కాలనీవాసుల వేడుకోలు

గార్ల, ఏప్రిల్ 21, ప్రభాత గమనం:

పాలకులు మారుతున్నారు.. ఏళ్లు గడుస్తున్నాయి.. కానీ ఆ కాలనీ వాసుల తలరాత మాత్రం మారడం లేదు. 'స్వచ్ఛ భారత్' నినాదాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి తప్ప, క్షేత్రస్థాయిలో మురుగు నీటి కష్టాలు తీరడం లేదు. గార్ల మండలం పుల్లూరు గ్రామ పరిధిలోని ఎస్సీ కాలనీ ప్రస్తుతం దుర్వాసనతో, మురుగు నీటితో నరకాన్ని తలపిస్తోంది.కాలనీలో సరైన సైడ్ కాల్వలు (డ్రైనేజీ) లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోంది. గ్రామ పంచాయతీ అధికారులకు మొరపెట్టుకుంటే, వారు వచ్చి మొక్కుబడిగా పైపైన పూడిక తీసి వెళ్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాల్వల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం వల్ల మురుగు నీరు నిలిచిపోయి తీవ్రమైన దుర్వాసన వస్తోంది.మురుగు నీరు నిల్వ ఉండటంతో కాలనీలో దోమల ఉధృతి విపరీతంగా పెరిగింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా దోమలు కరుస్తుండటంతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం పాలవుతారని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. కాలనీ గుండా నడవాలంటేనే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఈ నరకం నుంచి తమకు విముక్తి ఎప్పుడని వారు ప్రశ్నిస్తున్నారు."గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో డ్రైనేజీ పనులు చేయిస్తామని హామీ ఇచ్చి చేతులు దులిపేసుకుంది. ఇప్పుడున్న వారిని అడిగితే పాత బిల్లులు రాలేదని, నిధుల కొరత ఉందని సాకులు చెబుతున్నారు. మా ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారా?" అని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓట్ల కోసం వచ్చే నాయకులు, సమస్యల పరిష్కారంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పుల్లూరు ఎస్సీ కాలనీలో శాశ్వత ప్రాతిపదికన డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలని, పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# నిఘా నీడలో కేసముద్రం 11వ వార్డు..



- సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన కౌన్సిలర్ ఆగే రాము
- అభినందించిన వార్డు ప్రజలు

కేసముద్రం, ఏప్రిల్22, ప్రభాత గమనం :

కేసముద్రం మున్సిపల్ ఎన్నికల హామీల్లో భాగంగా కేసముద్రం మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ ఆగే రాము ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి రూ. 1 లక్ష 2 వేల విలువైన 12 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి అందరికి ఆదర్శంగా నిలిచారు. ఈ నేపథ్యంలో కేసముద్రం మున్సిపాలిటీ కేంద్రంలోని 11 వార్డు పరిధిలోని ఆదర్శ నగర్ ప్రాంతంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ క్రింద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సీఐ సత్యనారాయణ ఆదేశాల మేరకు బుధవారం ఎస్సై క్రాంతి కిరణ్ తన బృందంతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ..ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. సీసీ కెమెరాల నిఘాతో నేర నియంత్రణకు చెక్ పెట్టొచని, అదేవిదంగా సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతంలో ఎవరైనా చట్టావ్యతిరేక కార్యకలాపాలు సాగించాలన్న బయపడాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ప్రజలకు, ఇటు పోలీసులకు తన వంతు సహకారం అందించిన 11 వార్డు కౌన్సిలర్ ఆగే రామును ఈసందర్భంగా పోలీసులు అభిందించారు. అదేవిదంగా కౌన్సిలర్ రామును ఆదర్శనంగా తీసుకోని మిగితా వార్డు కౌన్సిలర్లు తమ వంతుగా వారి వారి వార్డుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నేరానియంత్రణకు వారు సైతం సహకారం అందించాలని ఎస్సై కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు మాజీ వార్డ్ మెంబర్ బిర్రు వెంకన్న,ఆగె వెంకన్న,రొడ్డ రాజు , బోడ రవి ,ఆగే దేవేందర్ , ఆగే శ్రీను , దరవాత్ బీమ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాలను పెంచాలి

- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

కేసముద్రం, ఏప్రిల్ 22 ప్రభాత గమనం :

99 రోజుల ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో బుధవారం కేసముద్రం మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మండలంలోని కల్వల మోడల్ స్కూల్,మహమూద్ పట్నంలో కేజీబీవీ లో అదనపు కలెక్టర్ కళాశాలను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజన నాణ్యత విద్యా బోధనను పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, రికార్డులు మరియు హాజరును తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ హాస్టళ్లలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పారిశుధ్యం మరియు విద్యుత్ సౌకర్యాలు నిరంతరం అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని, వంటశాలలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పెండింగ్‌లో ఉన్న చిన్నపాటి మరమ్మతు పనులను తక్షణమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వసతి గృహాల పనితీరును మెరుగుపరచడంలో, విద్యా ప్రమాణాలను పెంచడం అధికారుల యొక్క కర్తవ్యం అని అన్నారు.





# టీఆర్పీలో భారీగా చేరికలు

హైదరాబాద్, ప్రభాత గమనం:

వనపర్తి జిల్లా మదనాపురం మండలం శంకరమ్మ పేట గ్రామానికి చెందిన యువకులు తెలంగాణ రాజ్యాధికార పార్టీ లో చేరారు. వనపర్తి జిల్లా టీఆర్పీ యూత్ అధ్యక్షులు జి. రవికుమార్ ఆధ్వర్యంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న యువకులకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మల్లన్న మాట్లాడుతూ.. బీసీలకు న్యాయం చేయడం, వారికి రాజ్యాధికారాన్ని సాధించడమే టీఆర్పీ లక్ష్యమని తెలిపారు. యువత ముందుకు వచ్చి పార్టీలో చేరడం ఆనందకరమని, ఇది భవిష్యత్తులో పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని అన్నారు. పార్టీలో చేరిన యువకులు మాట్లాడుతూ.. మల్లన్న నాయకత్వం, బీసీల అభివృద్ధి కోసం చేస్తున్న పోరాటం పట్ల ఆకర్షితులై టీఆర్పీలో చేరినట్లు తెలిపారు. పార్టీ లక్ష్యాల సాధన కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# మడిపల్లిలో 15 సీసీ కెమెరాల ఏర్పాటు

- మన ఊరు మన బాధ్యతలో భాగంగా ఏర్పాటు
- 200 మందితో బైక్ ర్యాలీ
- పాల్గొన్న మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్



ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో

మహబూబాబాద్ జిల్లా మడిపెల్లి గ్రామంలో "అరైవ్-అలీవ్ మన ఊరు మన బాధ్యత" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. శబరిష్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామంలో సుమారు 200 మంది గ్రామస్తులతో కలిసి హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ ద్వారా రోడ్డు భద్రతపై గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన 15 సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. గ్రామ భద్రతను పెంపొందించడంలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన స్థానిక సర్పంచ్ రామలింగం మరియు దాతలను జిల్లా ఎస్పీ అభినందించారు. తదుపరి నిర్వహించిన సభలో జిల్లా ఎస్పీ డా. శబరిష్ గ్రామ ప్రజలతో మమేకమై మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అది ప్రాణాలను కాపాడే ముఖ్యమైన రక్షణ సాధనమని తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించడంలో హెల్మెట్ వినియోగం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. అలాగే గ్రామాల్లో గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం సమాజాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. ఎవరైనా గంజాయి వినియోగం లేదా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందించిన వారికి ₹5000 నగదు బహుమతి అందజేస్తామని, సమాచారం అందించిన వారి గోప్యతను పూర్తిగా కాపాడుతామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోలీసు శాఖ సూచనలను పాటిస్తూ మడిపెల్లి గ్రామాన్ని సురక్షిత, ఆరోగ్యకర, మత్తుమందుల రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరం అన్నారు. గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్న పోలీస్ సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ డా. శబరీష్, అభినందించారు.

# పట్టణాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పన్నులు చెల్లించాలి
- విద్యాశాఖలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**మహబూబాబాద్ ఏప్రిల్ 22(ప్రభాత గమనం) :**

పట్టణాలు , గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని అధిక నిధులు కేటాయించడం జరుగుతుందని, గ్రామాలు పట్టణాలలో ప్రజలు తమ యొక్క ఇంటి పన్ను నల్ల పన్ను బాధ్యతాయుతంగా చెల్లించి గ్రామాలు పట్టణాల అభివృద్ధికి సహకరించాలని, విద్యాశాఖలో పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోతు జ్యోతి, కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోతు సునీత, వైస్ చైర్పర్సన్ అల్లం రమ,మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత ఇంజనీరింగ్, హెల్త్, శానిటేషన్, విద్యాశాఖ సిబ్బందితో పెండింగ్ పనులు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రభుత్వ సహకారంతోపాటు ప్రజల సహకారంతో పట్టణాల అభివృద్ధికి సహకరించాలని, ఇంటి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్స్, లే అవుట్ అనుమతుల ద్వారా నిధులు సేకరించాలని, పన్నుల వసూళ్లకు విస్తృత ప్రచారం కల్పించాలని, బల్క్ ఎస్ఎంఎస్ ల ద్వారా ప్రజలకు తెలియపరచాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో నిత్యం శానిటేషన్ నిర్వహిస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని దశలవారీగా సిబ్బందిని కేటాయించాలని, వారికి షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, యూనిఫామ్స్ ఇతర సదుపాయాలు కల్పించాలని సూచించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా హాజరు నమోదు చేయాలని తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మిషన్ భగీరథ, మున్సిపల్ ద్వారా అందించే వాటర్ సప్లై నిత్యం గమనిస్తూ ఉండాలని, అవసరం ఉన్నచోట టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తెలిపారు. ఒక ప్రణాళిక ప్రకారం అన్ని విభాగాల సిబ్బంది పనిచేసి పట్టణాల అభివృద్ధికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలలో అక్రమ నిర్మాణాలను అరికట్టాలని ఆదేశించారు.

శానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరం ఉన్నచోట ఆటోలు ట్రాక్టర్స్ ఇతర వాహనాల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు. కేసముద్రం నూతన మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. మహబూబాబాద్, కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్లు పట్టణాల అభివృద్ధి కోసం పలు సూచనలు సలహాలు అందించారు. అంతర్గత రోడ్ల నిర్మాణం అభివృద్ధి పనులు పార్కులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వినియోగంలోకి తీసుకురావడం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు సమన్వయంతో కలిసి పనిచేసి పట్టణాలు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆమె సూచించారు. విద్యాశాఖలోని సుమారు (839) పాఠశాలలలో వివిధ అభివృద్ధి పనులు కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, కాంపౌండ్ వాల్, త్రాగునీరు సరఫరా సిస్టం, మైనర్ రిపేర్, మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మంజూరు అయిన పనులు కొన్ని పెండింగ్లో ఉన్నందున అట్టి పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి రాజేశ్వర్, కేసముద్రం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మహబూబాబాద్ ఇంచార్జీ కమిషనర్ ఉపేందర్, టిపిఓ సాయి రామ్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్యా శాఖ ఇంజినీరింగ్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ లు, తదితరులు పాల్గొన్నారు.



## కమ్యూనిజంతోనే దేశంలో ప్రజా విముక్తి సాధ్యం

- సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేత అన్నారపు హనుమంతు

**కేసముద్రం, ఏప్రిల్ 22, ప్రభాగ గమనం:**

"దేశంలో పీడిత ప్రజల విముక్తి కేవలం కమ్యూనిజంతోనే సాధ్యమవుతుందిని" సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు అన్నారపు హనుమంతు స్పష్టం చేశారు. బుధవారం కేసముద్రం పట్టణ కేంద్రంలో సిపిఐఎంఎల్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో బట్ట మేకల రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హనుమంతు పార్టీ జెండాను ఆవిష్కరించారు.అనంతరం పి. చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ నాయకుడు బొమ్మగాని వెంకన్న మాట్లాడారు.. మార్క్సిస్టు మహోపాధ్యాయుల జయంతి సందర్భంగా ఆవిర్భవించిన సీపీఐ (ఎంఎల్) పార్టీ, గత 57 ఏళ్లుగా అణగారిన వర్గాల హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతోందని కొనియాడారు. విప్లవ పంథాలో నడుస్తూ ప్రజల గొంతుకగా నిలవడమే పార్టీ ఆశయమని ఆయన పేర్కొన్నారు.అనంతరం అన్నారపు హనుమంతు మాట్లాడుతూ..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు.తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ ప్రజలకు చేకూరిన ప్రయోజనం శూన్యమని, అందుకే ప్రజలు ఆ ప్రభుత్వాన్ని గద్దెదించారని విమర్శించారు.అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ప్రజలను ప్రలోభాలకు గురిచేసి ఇప్పుడు మొండి చేయి చూపిస్తోందని ధ్వజమెత్తారు. ప్రజలు ఇప్పటికైనా చైతన్యవంతులై, కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సాగే ప్రజా పోరాటాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్ట మేకల రాజు, పిన్నోజు చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ఎంసీపీఐ(యూ) మద్దతు

- కేసముద్రం మార్కెట్ సెంటర్ లో సంఘీభావం

**కేసముద్రం, ఏప్రిల్ 22, ప్రభాత గమనం :**

తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా క్షేత్రస్థాయిలో పోరాటాలు ఉధృతమవుతున్నాయి. కేసముద్రం మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ సెంటర్లో ఎంసీపీఐ(యు) పార్టీ అలాగే ఏఐసీటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంసీపీఐ(యు) మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల పట్ల అనుసరిస్తున్న ఉదాసీన వైఖరిని ఆయన తీవ్రంగా ఖండించారు.కార్మికులు కోరుతున్న డిమాండ్లు అత్యంత న్యాయమైనవని, వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వం కాలయాపన చేయడం తగదని హెచ్చరించారు.రవాణా రంగం స్తంభించిపోవడం వల్ల సామాన్య ప్రజలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.ఆర్టీసీ కార్మికుల పోరాటానికి తమ పార్టీ మరియు కార్మిక సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని, అవసరమైతే కార్మికులతో కలిసి ప్రత్యక్ష పోరాటాల్లోకి దిగుతామని స్పష్టం చేశారు. "ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేయకుండా, తక్షణమే కార్మిక సంఘాల నేతలతో మాట్లాడి సమ్మెను విరమింపజేసేలా చర్యలు తీసుకోవాలి. కార్యక్రమంలో వేల్పుల వెంకన్న, గుగులోతు లక్ష్మణ్, అందే భాస్కర్, రాస ఉప్పలయ్య, కస్తూరి వెంకన్న, బోడ వీరన్న నాయక్, సునీల్, మురళి, నేరడ వీరస్వామి, బిక్కు నాయక్, సురేష్, సంజీవ, బానోత్ ఈసు ఉన్నారు.

## వ్యాసరచన పోటీల్లో ఇన్ స్పెక్టర్ వెంకటనారాయణ ప్రతిభ

- డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందజేత
- అభినందించిన ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్

**ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో**



అక్టోబర్ 21న నిర్వహించే పోలీస్ కమేమొరేషన్ డే సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడినవి. ఈ కార్యక్రమాలలో భాగంగా ప్రజలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొనే విధంగా వివిధ అవగాహన కార్యక్రమాలు, పోటీలు నిర్వహించబడినవి. ఈ సందర్భంగా వివిధ హోదాల పోలీసు అధికారుల కోసం వ్యాసరచన పోటీ నిర్వహించగా, "గ్రౌండ్ లెవల్ పోలీసింగ్ మెరుగుదలకు పోలీసు అధికారుల పాత్ర" అనే అంశంపై జరిగిన అధికారుల విభాగం పోటీలో ములుగు జిల్లా నుంచి ప్రస్తుతం MTOగా విధులు నిర్వహిస్తున్న ఇన్స్పెక్టర్ సి హెచ్ . వెంకటనారాయణ ప్రథమ స్థానం సాధించారు. ఈ విజయానికి గాను రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి, చేత ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాధ్ కేకెన్ ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ ని అభినందించి, భవిష్యత్తులో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

## ఘనంగా సీపీఐ (ఎంఎల్) 57వ ఆవిర్భావ దినోత్సవం

**గార్ల, ఏప్రిల్ 22, ప్రభాత గమనం:**



మండల పరిధిలోని గోపాలపురం గ్రామంలో సిపిఐ (ఎంఎల్) 57వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విప్లవ యోధుడు కామ్రేడ్ లెనిన్ జయంతిని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు కామ్రేడ్ జంగాల పెంటయ్య ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, పీడిత వర్గాల విముక్తి కోసం సిపిఐ (ఎంఎల్) ఐదు దశాబ్దాలకు పైగా రాజీలేని పోరాటం చేస్తోందని కొనియాడారు. లెనిన్ ఆశయ సాధనలో కార్యకర్తలు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.ఈ వేడుకల్లో పార్టీ ముఖ్య నాయకులు CH. గణేష్, ఇర్రి రవి, ఎం. వీరభద్రం, మట్టపల్లి వెంకన్న (G. బజార్), ఎన్. కొండలరావు, జే. కొండల రావు, ఎర్రగడ్డ కొండలరావు పాల్గొన్నారు. అలాగే చింతలచెరువు మధు, శ్రీను, గుడిసెట్టి జస్వంత్, కాంతారావు, గోసు కొండలరావు తదితర కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## హత్య కేసులో నిందితుడు అరెస్ట్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన చిలువేరు పోశయ్య (66) పై పాత కక్షల నేపథ్యంలో ఇనుగాల కుమారస్వామి కర్రతో దాడి చేయగా, తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ ఎంజీఎం ఆసుపత్రిలో మృతి చెందారు. మృతుడి భార్య ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా చిట్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లేశ్ ఎస్.ఐ ముప్పు సురేష్ సిబ్బందితో కలిసి బుధవారం ఉదయం మొగుళ్లపల్లి పెద్దమ్మ తల్లి గుడి సమీపంలో నిందితుడు ఇనుగాల కుమారస్వామిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వ్యక్తిగత కక్షలు, వివాదాలను చట్టపరమైన మార్గాల్లోనే పరిష్కరించుకోవాలి. హింసాత్మక చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీస్ అధికారులు హెచ్చరించారు.



## పుల్లూరు అంగన్వాడీ కేంద్రాల్లో ఘనంగా 'గ్రాడ్యుయేషన్ డే'

**గార్ల, ఏప్రిల్ 22, ప్రభాత గమనం :**


అంగన్వాడీ కేంద్రాలు కేవలం పోషకాహార కేంద్రాలే కాదని, అవి చిన్నారుల బంగారు భవిష్యత్తుకు పునాది వేసే విద్యా నిలయాలని జిల్లా సంక్షేమ అధికారిని (DW0) సబిత పేర్కొన్నారు. బుధవారం గార్ల మండలం పుల్లూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాల్లో 'గ్రాడ్యుయేషన్ డే' వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పోషణ్ అభియాన్'లో భాగంగా ఈ నెల 9 నుండి 23 వరకు నిర్వహిస్తున్న 'పోషణ్ పక్వాడ' (పోషణ పక్షోత్సవాలు) ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో, అంగన్వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని, ప్రాథమిక పాఠశాలల్లో చేరడానికి సిద్ధంగా ఉన్న చిన్నారుల కోసం ఈ గ్రాడ్యుయేషన్ డేను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంక్షేమ అధికారిని సబిత మాట్లాడుతూ..గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు మరియు సామాన్య ప్రజలందరూ ప్రభుత్వం అంగన్వాడీల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి.నుండి 6 ఏళ్ల వయస్సు గల పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలకు పంపించి, వారిలో అభ్యాసన సామర్థ్యాన్ని పెంపొందించాలి.అంగన్వాడీలో విద్యను పూర్తి చేసుకున్న చిన్నారులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె ఆకాంక్షించారు.అనంతరం, అంగన్వాడీ విద్యను విజయవంతంగా పూర్తి చేసుకున్న చిన్నారులను అధికారులు ఘనంగా సత్కరించి, వారికి అభినందనలు తెలిపారు. ప్రైమరీ స్కూల్‌కు వెళ్లేందుకు సిద్ధమైన చిన్నారుల ముఖాల్లో ఉత్సాహం ఉట్టిపడింది.ఈ కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మి, సూపర్ వైజర్స్ శారద, గ్రామ సర్పంచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



## బేరువాడ మత్స్య పారిశ్రామిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా గుండా చిన్నవెంకన్న, ఉపాధ్యక్షుడిగా కొండబోయిన శ్రీను

**కేసముద్రం, ఏప్రిల్ 22, ప్రభాత గమనం :**



బేరువాడ లో బుధవారం మత్స్య పారిశ్రామిక సంఘం నూతన కమిటీని సభ్యులందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షునిగా గుండా చిన్నవెంకన్న, ఉపాధ్యక్షునిగా కొండబోయిన శ్రీను, కార్యదర్శిగా పేరబోయిన వెంకన్నను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లుగా కొండబోయిన గోపాల్, గుండ పెద్దవెంకన్న, గుండె శ్రీను, మామిళ్ల యాకయ్య, గుండ సుధాకర్, కొండబోయిన వీరన్నలను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియ మత్స్యశాఖ జూనియర్ అసిస్టెంట్ అజయ్ సమక్షంలో ప్రశాంతంగా నిర్వహించబడింది. సంఘం సభ్యులందరూ ఏకగ్రీవంగా కొత్త కమిటీని ఎన్నుకోవడం సంఘ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది

## గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు

- 30 లీటర్ల గుడుంబా, 350 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

**ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో :**

భూపాలపల్లి జిల్లాలో అక్రమ గుడుంబా తయారీని అరికట్టేందుకు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు పలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలోనీ సర్వాయిపేట గ్రామంలో ప్రత్యేక దాడులు నిర్వహించబడినవి. ఈ సందర్భంగా సర్వాయిపేట గ్రామంలో అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న వారిపై చర్యలు తీసుకున్నారు. దాడులలో భాగంగా సుమారు 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతో పాటు, గుడుంబా తయారీకి వినియోగిస్తున్న సుమారు 350 లీటర్ల బెల్లం పానకంను గుర్తించి అదే ప్రదేశంలో ధ్వంసం చేయడం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి నిందితులపై చట్టపరమైన కేసులు నమోదు చేయబడినవి. జిల్లాలో అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలపై సమాచారం అందించాలని పోలీసులు కోరారు. సమాచారం అందించిన వారు పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABAD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374